లక్ష్మీనరసింహుడికి నిత్య తిరుకల్యాణోత్సవం

స్పటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పురోహితుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 12: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవసేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటికలింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 17,71,886 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

ఆలేరురూరల్, ఆగస్టు12 : గంధమల్ల రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేసి ఆలేరు ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆలేరులో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న నిర్వహించే పార్టీ జిల్లా సమితి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు చెక్క వెంకటేశ్, చౌడబోయిన కనకయ్య, ప్రవీణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

లింక్‌రోడ్డు సౌకర్యం కల్పించాలి

మోటకొండూర్ : మండల కేంద్రానికి అన్ని గ్రామల నుంచి లింక్‌రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిలు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, నాయకులు శ్రీను, రేగు సిద్దయ్య, ఆలేటి బాలరాజు, ముసుగు పెంటారెడ్డి, పల్లె వెంకన్న, శీనివాసు, మంచాల రాధమ్మ, పసుల నరసింహ పాల్గొన్నారు.

దంతూరు రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు

రోడ్డుకు ఇరువైపులా హరిత తోరణాలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 12 : గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగవంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి నేడు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పోచంపల్లి మండలంలోని దంతూరు గ్రామ రహదారి వెంట నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో నిండాయి. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులకు హరిత తోరణాలు స్వాగతం పలుకుతున్నాయి.

ధర్నా చేస్తున్న గిరిధర్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

మోటకొండూర్, ఆగస్టు 12: మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన అయిలీ గిరిధర్ విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గిరిధర్ గ్రామంలో పంచాయతీ వీధిలైట్లు వేస్తున్న క్రమంలోనే విద్యుదాఘాతానికి గురయ్యాడని, విద్యుత్, గ్రామ పంచాయతీ అధికారులు మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నా చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఉపేందర్

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

రాజాపేట, ఆగస్టు 12 : మండలంలోని నెమిలె జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు సోమవారం సైబర్ నేరాలపై ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన, చైన్ స్నాచింగ్, మహిళలపై జరిగే వేధింపులు వంటి అంశాలపై వివరించారు. సైబర్ అంబాసిడర్లుగా సర్టిఫికెట్లు పొందిన పాఠశాల విద్యార్థులు వారి అనుభావాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలపై సత్వరమే స్పందించాలి

● కలెక్టర్ హనుమంతు కె. జెండగే

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు12 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ హనుమంతు కె.జండగే ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం 72 అర్జీలు రాగా అందులో 55 రెవిన్యూ శాఖకు సంబంధించినవి, 5 ఉపాధి కల్పన, 4 పంచాయతీ రాజ్‌శాఖ, అటవీ శాఖ 2, మున్సిపాలిటీ 2, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖలకు ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, జడ్పీ సీఈఓ శోభారాణి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలని వినతి

రాజాపేట : మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహ సమీపంలో ఉన్న గ్రామ పంచాయతీ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజాపేట రాక్‌యూత్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కలెక్టర్ హనుమంతు కె. జండగేకు వినతిప్రతం అందించారు. గ్రామానికి చెందిన చెల్మిడి వెంకటేశ్ 80 గజాల భూమిని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేపట్టాడని, దానిని పరిశీలించకుండానే పంచాయతీ కార్యదర్శి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో యూత్ అధ్యక్షుడు గొల్లెన ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి దిడ్డి అవినాశ్, కోశాధికారి సట్టు రవీందర్ ఉన్నారు.

14న భువనగిరిలో తాగునీటి సరఫరా నిలిపివేత

భువనగిరి అర్బన్, ఆగస్టు 12: ఈ నెల 14న భువనగిరి పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సైనిక్‌పురి నుంచి భువనగిరికి వచ్చే పైప్‌లైన్‌కు మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో లీకేజీ అవుతున్నందున మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విషయాన్ని ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

ఆత్మకూరు(ఎం), ఆగస్టు12 : మండలంలోని చిన్నగూడెంలో గ్రామానికి చెందిన రైతు నిమ్మల దశరథకు చెందిన కాడెద్దు విద్యుదాఘాతంతో మృతి చెందింది. దశరథ గ్రామంలో కౌలుకు తీసుకున్న భూమిలో పత్తి సాగు చేశాడు. సోమవారం పత్తి చేనులో గుంటుక తోలుతుండగా చేనులో మట్టిలోంచి వేసిన విద్యుత్ సర్వీస్ వైరు ఎద్దుకు తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందింది. గుంటుక కొడుతున్న రైతు కూడా స్వల్పంగా విద్యుదాఘాతానికి గురైన ప్పటికీ తృటిలో బయటపడ్డారు.

యువకుడి ఆత్మహత్య

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 12 : రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయగిరి-వంగపల్లి రైల్వే లైన్‌లో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని రాయగిరి గ్రామానికి చెందిన లస్కర్ మధు(27) సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మధు మృతికి కారణాలు తెలియరాలేదని, మృతుని తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ..

చౌటుప్పల్, ఆగస్టు 12 : ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం శ్రీని పరిశ్రమ క్వార్టర్స్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కాట్నీ జిల్లా చారి గ్రామానికి చెందిన సోన్ పటేల్(23) కొంతకాలంగా శ్రీని పరిశ్రమలో కాంట్రాక్ట్ కూలీగా పనిచేస్తూ పరిశ్రమ క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఆదివారం గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

సీఎం సహాయ చెక్కు పంపిణీ

రామన్నపేట, ఆగస్టు 12: మండల కేంద్రానికి చెందిన బాధితులకు ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.74లక్షల చెక్కును సోమవారం కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు జినుకల ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్ అందించారు. కార్యక్రమంలో గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, జెల్ల వెంకటేశం, ఎండీ అక్రం, రామిని రమేశ్, ఎండీ నాసర్ పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో బస్‌షెల్టర్లు నిర్మించాలి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వినతి

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 12 : మునుగోడు నియోజకవర్గంలోని 21 రూట్లలో ఆర్టీసీ బస్సులు నడపాలని, అన్ని మండల కేంద్రాల్లో బస్టాండ్ల నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందించారు. అంతకుముందు నియోజకవర్గంలో పబ్లిక్ రవాణా కనెక్టవిటీ, ఆర్టీసీ బస్టాండ్ల నిర్మాణం, నవీకరణ, ఏయే రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించాలనే విషయమై మండలాల ముఖ్యనాయకులతో సమావేశమై చర్చించారు. అనంతరం వారితో కలిసి వెళ్లి మంత్రికి వినతి పత్రం అందించారు.

గ్రామాలకు లైన్‌మన్ లేక రైతుల అవస్థలు

● ప్రైవేటు వ్యక్తులతో పని చేయించడంతో ప్రమాదాలు

విద్యుదాఘాతంతో గాయపడిన రైతు

ఆత్మకూరు(ఎం),ఆగస్టు 12 : మండలంలోని పల్లెపహాడ్ గ్రామానికి లైన్‌మన్ లేకపోవడం, విద్యుత్ సమస్య ఏర్పడితే ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించడం వల్ల రైతులు ప్రమాదానికి గురవుతున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల చోటు చేసుకోగా సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌కు గ్రామంలో 1.5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బోరు ద్వారా వరి సాగు చేస్తున్నాడు. ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఈ నెల 2న కాలిపోయింది. దాంతో శంకరయ్యతో పాటు రైతులు దానిని మోత్కూర్‌లోని సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లి మరమ్మతులు చేయించారు. దానిని బిగించేందుకు రావాలని ఈ నెల 3న ఇన్‌చార్జి లైన్‌మన్ వెంకటయ్యకు రైతులు ఫోన్ చేశారు. అయితే తాను బిజీగా ఉన్నానని, గ్రామంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తి సహకారం తీసుకోవాలని లైన్‌మన్ సమాధానం చెప్పినట్లు రైతులు తెలిపారు. అయితే రైతులు, సదరు ప్రైవేటు వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తుండగా రైతు శంకరయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే తోటి రైతులు అతడిని జనగామలోని దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. దాంతో ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి శాశ్వత లైన్‌మన్ లేక పోవడంతో తరచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు లైన్‌మన్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు.

రైతులు తొందర పడ్డారు : లైన్‌మన్ వెంకటయ్య

పల్లెపహాడ్ గ్రామానికి చెందిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని ఈ నెల 3న ఫోన్ చేశారు. నేను వేరే ఊర్లో ఉన్నాను తర్వాత వస్తానని చెప్పాను. నాకు మరో 3 గ్రామాలు ఉండడంతో ఆలస్యమైంది. దాంతో రైతులు తొందరపడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న క్రమంలో ఒక రైతు విద్యుదాఘాతానికి గురయ్యాడు. నేను వస్తానని చెప్పినా రైతులు తొందరపడ్డారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక

పంచాయతీ కార్యదర్శుల కమిటీ సభ్యులు

చౌటుప్పల్, ఆగస్టు 12 : తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం మండల కమిటీని సోమవారం చౌటుప్పల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పాల్వాయి స్రవంతి, గౌరవ అధ్యక్షుడిగా పి.సతీశ్ కుమార్, ప్రధానకార్యదర్శిగా డి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా బి.జ్యోతి, సీహెచ్.శ్రీకాంత్, కోశాధికారిగా పి.శ్రీశైలం, సంయుక్త కార్యదర్శులుగా పి.సక్కుబాయి, జి.పాండు, కార్యవర్గ సభ్యులుగా కల్పన, ఎన్.భవాని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ, ఆగస్టు12 : మండలంలోని చిత్తాపురం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సోమవారం సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడు తండాకు చెందిన ధరావత్ మహేందర్ రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వలిగొండ మండలం చిత్తాపురం గ్రామంలో రైతు షెడ్‌లో నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న సివిల్ సప్లై విజిలెన్స్ అధికారులు దాడి చేసి 52 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాడిలో విజిలెన్స్ సీఐ షేక్‌గౌస్, సివిల్ సప్లై డీటీ బాలమణి, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడాలి

● కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ చైర్మన్ చంద్రఘోశ్‌కు మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్ వినతి

కమిషన్ ఏర్పాటు చేసిన బాక్స్‌లో వినతిపత్రం వేస్తున్న మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్, రైతులు

తుర్కపల్లి, ఆగస్టు12: కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారపడ్డ వేలాది మంది రైతుల ఆవేదనను అర్థం చేసుకొని ప్రాజెక్టును కాపాడాలని కోరుతూ తుర్కపల్లి మాజీ ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్ సోమవారం హైదరాబాద్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రగోశ్ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లో వినతి పత్రం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఏర్పాట్టిన తొలి ప్రభుత్వం తమ ఉద్యమ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, రైతుల ఆత్మహత్యలు ఆపాలనే ఆలోచనలతో.. గొంతెండుతున్న ప్రజల దాహార్తిని తీర్చడానికి.. బీడువారిన భూములకు సాగుజలాలు అందించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని తెలిపారు. రాష్ట్ర భౌగోలిక స్వరూపం దృష్ట్యా ఎత్తిపోత ప్రాజెక్టులు తప్ప మరో మార్గం లేకనే రూ. లక్షల కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మించారని పేర్కొన్నారు. అటువంటి తెలంగాణ ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజకీయాలకు తావులేకుండా కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరించి ప్రజలకు తాగు, రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ప్రాజెక్టులో చిన్న చిన్న లోపాలను సరిచేస్తూ రాష్ట్ర ఆర్థిక ప్రగతిని దృష్టిలో ఉంచుకుని అన్ని పంపలను ఉపయోగించి శాశ్వత ప్రాతిపదికగా రిజర్వాయర్ నింపి నీటిని విడుదల చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులను తెలిపేలా వినతి పత్రాన్ని కమిషన్ బాక్స్‌లో వేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట రైతులు బద్దు నాయక్, బిచ్చు నాయక్, నంద్యా రాజేశ్‌నాయక్, భాస్కర్ నాయక్, రెడ్డి నాయక్, బధ్రు ఉన్నారు.

నల్లబోలు ఇండస్ట్రీస్ భూములను పేదలకు పంచాలి

బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

సమావేశంలో మాట్లాడుతున్న కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, ఆగస్టు 12: మల్లాపురం గ్రామంలో సర్వే నంబర్ 424లో గల వంద ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నల్లబోలు ఇండస్ట్రీస్‌ను తొలగించి సదరు భూమిని పేదలకు పంచాలని బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదరు భూమిని కబ్జా చేశామని నల్లబోలు ఇండస్ట్రీస్ అధినేత ధర్మారెడ్డి చేస్తున్న ఆరోపనలు అవాస్తవమన్నారు. సోమవారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు కర్రె వీరయ్య, ఎండీ ఖలీల్, పి.ఉపేందర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. సర్వే నంబర్ 424లో ఉన్న భూమిని 50 ఏండ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఆయేషా బేగం వద్ద కొండల్‌రెడ్డి కొనుగోలు చేసినట్లు సరైన ఆధారాలు లేవన్నారు. 50 ఏండ్లుగా కొండల్‌రెడ్డి, ఆయన కుమారులకు పట్టాదారు పాసుపుస్తకం లేదన్నారు. ప్రస్తుతం కొండల్‌రెడ్డితో పాటు ఆయన కుమారుల్లో కొంత మంది మృతి చెందారని పేర్కొన్నారు. కొండల్‌రెడ్డి బతికున్న సమయంలో ఆయన నుంచి కండీషనల్ మార్టిగేజ్ చేసుకున్నట్లు చెబుతున్న నల్లబోలు ఇండస్ట్రీస్ అధినేత ఎందుకు పట్టాదారు పాసు పుస్తకం చేసుకోలేకపోయాడో చెప్పాలన్నారు. భూమిపై హక్కు ఉంటే పాసు పుస్తకాలు ఎందుకు అమలు కాలేదో చెప్పాలన్నారు. గతంలో ఉన్న ఇద్దరు తాసీల్దార్లు రామకృష్ణ, అశోక్‌రెడ్డి, నల్లగొండ జిల్లా సబ్ రిజిస్ట్రార్ సైతం సదరు భూమి ధర్మారెడ్డికి వర్తించదని, పాస్‌పుస్తకాలు అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారని తెలిపారు. సర్వే నంబర్ 424లో ఉన్న భూమి ఆయేషాబేగం కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న వారసత్వ భూమి అని, దానిపై ఆమెకు సర్వహక్కులు చెందుతాయని కోర్టు నుంచి ఆర్డర్ వచ్చిందన్నారు. అసలైన పట్టాదారు ఆయేషాబేగం వద్ద నుంచి తాము 56 ఎకరాలు అమ్మకపు దస్తావేజు కింద కొనుగోలు చేశామని, ధరణి రికార్డుల్లో తమ పేర్లు వస్తున్నాయని, పట్టాదారు పాసుపుస్తకాలు అమలయ్యాయని, భూమిపై పూర్తి హక్కు తమకే ఉందని తెలిపారు. ఎలాంటి హక్కులు లేకున్నా నల్లబోలు ఇండస్ట్రీస్ అధినేత కోర్టుకు వెళ్లాడని, కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడాలన్నారు. సదరు భూమికి నిజమైన హక్కుదారులెవరో కోర్టే నిర్ణయిస్తుందన్నారు. చట్ట ప్రకారమే భూమిని కొనుగోలు చేశామని, అది నిజంకాదని నిరూపిస్తే భూమిని వదిలి రాజకీయ సన్యాసం చేస్తానన్నారు. నల్లబోలు ఇండస్ట్రీస్ అధినేత కొనుగోలు చేసిన 198 ఎకరాల్లో 100 ఎకరాలు ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో సబ్ కలెక్టర్ పేరుమీదే ఉందని స్పష్టం చేశారు. వెంటనే అధికారులు స్పందించి సదరు భూమిని స్వాధీనం చేసుకొని భూమి లేని నిరుపేదలకు పంచాలన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచే వరకు రిలే నిరహార దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పార్టీలో చురుకుగా పాల్గొంటున్న తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు.

ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న ఆరెకటిక కులస్తులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 12 : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద రోడ్డు వెంట షెడ్లను ఏర్పాటు చేసుకొని ఆరెకటిక కులస్తులు జీవనోపాధి పొందుతున్నారని, సోమవారం పరిశ్రమలశాఖ అధికారులు వాటిని కూల్చివేయడం అన్యాయమని ఆరె కటిక సంఘం గౌరవాధ్యక్షుడు తంగెళ్లపల్లి రవికుమార్ అన్నారు. కట్టడాల కూల్చివేతకు నిరసనగా ఆరెకటిక కులస్తులు స్థానిక జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కట్టడాలను కూల్చివేయడం సరికాదని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరెకటిక సంఘం అధ్యక్షుడు హీరెకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గట్కారి శ్రీకాంత్, నాయకులు చంద్రశేఖర్, మహేశ్, జమాల్, నరేశ్, సతీశ్, శ్రీను, రవి, వెంకటేశ్, నాగమణి, అంజయ్య పాల్గొన్నారు.

దళిత రైతులకు పాట్టాదారు పాస్‌బుక్‌లు అందించాలి

ధర్నా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 12 : దళితులు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హనుమాపురం దళితుల పట్టాదారు పాసుబుక్కుల సాధన కమిటీ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిప్రతం అందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బిచ్చాల మహేందర్, ప్రధాన కార్యదర్శి ముడుగుల రాజు, నాయకులు బండారి రామచందర్, చందుపట్ల మల్లేష్, జనార్దన్, బిచ్చాల కొండలు, రైతులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్

నియామక పత్రం అందుకుంటున్న తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 12 : రాష్ట్ర పద్మశాలీ సంఘం ఉపా